ఈనాడు మంచిర్యాల

శనివారం అక్టోబరు 12, 2024

చేప చెరువుకు చేరేనా..

- అదను దాటుతుండటంతో ఆందోళనలో మత్స్యకారులు

నీలివిప్లవం పేరిట జిల్లాలోని జలవనరుల్లో ఏటా ఆగస్టులోగా టెండర్లు పూర్తి చేసి చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో చేపపిల్లలను వదులుతుండగా ఈ ఏడాది అక్టోబరు నెల గడుస్తున్నా ఇంకా కనీసం టెండర్ల దశకు కూడా చేరుకోలేదు. బిడ్డింగ్‌లో పాల్గొనేందుకు దరఖాస్తు చేసుకున్న ముగ్గురు గుత్తేదారులు ఈ ఏడాది చేపపిల్లలను ఇవ్వడానికి సుముఖంగా లేకపోవడంతో జల వనరుల్లో చేపపిల్లలను వదలడంపై సందిగ్ధం నెలకొంది. చేపపిల్లలను అందించేందుకు గుత్తేదారుల నుంచి బిడ్డింగ్ కోసం గతంలో రెండు సార్లు గడువు పొడిగించినా సరఫరాకు ఎవరూ ఆసక్తి ప్రదర్శించడం లేదు. దీంతో కొత్తగా ఎవరికైనా అవకాశం కల్పిస్తారా.. లేక పంపిణీ లేదని ప్రకటిస్తారా వేచి చూడాల్సి ఉంది.

లక్షెట్టిపేట, న్యూస్‌టుడే

జిల్లాలో ఏటా జూన్, జులై నెలల్లోనే జలవనరుల్లో చేపపిల్లలను వదిలేందుకు టెండర్లను పూర్తి చేస్తూ వచ్చారు. ఆగస్టు నాటికి చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో తగినంత నీరు వచ్చి చేరగానే చేప పిల్లలను వదులుతున్నారు. ఈ ఏడాది ఉచిత చేప పిల్లల పంపిణీపై ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావడంలోనే జాప్యమైంది. నెల రోజులు ఆలస్యంగా జులైలో ప్రభుత్వం బిడ్డింగులకు ఆదేశాలు ఇచ్చింది. గతేడాది సరఫరా చేసిన గుత్తేదారులు సీడ్ సరఫరాకు దరఖాస్తు చేసినా తర్వాత తమతో కాదని తేల్చేశారు. పలుమార్లు దరఖాస్తు గడువు పొడిగించినా గుత్తేదారులు చేపపిల్లల సరఫరాకు ముందుకు రాలేదు. మరోవైపు అదును దాటుతుండటంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మత్స్య సహకార సంఘాలకు చేప పిల్లలు అందజేస్తున్న దృశ్యం

బిల్లులు చెల్లించకపోవడమే కారణం

గతేడాది చేప పిల్లలను సరఫరా చేసిన గుత్తేదారులకు బిల్లులు రాకపోవడంతో వారు ఈ ఏడాది తిరిగి టెండర్లు పాడటానికి ముందుకు రాలేదని సమాచారం. చేప పిల్లలను ముగ్గురు గుత్తేదారులు సరఫరా చేయగా వారికి ఒక్కొక్కరికి సగటున రూ. 35 లక్షల నుంచి రూ. 60 లక్షల వరకు కలిపి మొత్తం రూ. 1.3 కోట్ల వరకు బకాయి పడ్డట్లు తెలుస్తోంది.

ఇతర జిల్లాల గుత్తేదారులకు కేటాయిస్తాం

- భాస్కర్, జిల్లా మత్స్య శాఖ అధికారి, మంచిర్యాల

జిల్లాలోని గుత్తేదారులు సీడ్ సరఫరాకు ముందుకు రావడం లేదు. గతేడాది సరఫరా చేసిన చేపపిల్లల డబ్బులు ఇస్తేగాని తాము సరఫరా చేయలేమని చెబుతున్నారు. ఇప్పటికే సమయం గడిచిపోయింది. పలుమార్లు గడువు పొడిగించినా ఫలితం లేదు. ఇతర జిల్లాల్లో సరఫరా చేసేందుకు సుముఖత వ్యక్తం చేసిన వారి నుంచి సీడ్ తీసుకుని జలవనరుల్లో వేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అక్టోబర్ చివరి వారం లోగా జలవనరుల్లో చేప పిల్లలు వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.



సప్తవ్యసనాల బొమ్మను పరిశీలిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

నేడు మందమర్రిలో రామ్‌లీలా ఉత్సవాలు

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే: దసరా పండగను పురస్కరించుకుని శనివారం సాయంత్రం నిర్వహించే రామ్‌లీలా ఉత్సవాలకు మందమర్రిలో సింగరేణి పాఠశాల మైదానాన్ని సిద్ధం చేశారు. పెద్ద ఎత్తున తరలివచ్చే కార్మిక, కార్మికేతర కుటుంబ సభ్యులు కార్యక్రమాన్ని తిలకించేందుకు ఎత్తుగా ఉండే భారీ వేదిక ఏర్పాటు చేశారు. విశాఖపట్నం నుంచి వచ్చిన బృందం సభ్యుల ఆధ్వర్యంలో వివిధ రకాల బాణసంచాలను కాల్చేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందుకోసం పది తలలు ఉన్న సుమారు 30 అడుగుల సప్తవ్యసనాల భారీ బొమ్మను ఏర్పాటు చేశారు. వేడుకల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సింగరేణి రెస్క్యూ, ఎస్అండ్‌పీసీ, పోలీసులను బందోబస్తు చేపట్టేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.



రెబ్బన్‌పల్లిలో సమీకృత గురుకులాల భవన నిర్మాణం కోసం భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

దండేపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యారంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు అన్నారు. దండేపల్లి మండలం రెబ్బన్‌పల్లిలో యంగ్ ఇండియా సమీకృత గురుకులాల భవన నిర్మాణం కోసం శుక్రవారం కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యారంగంలో చారిత్రాత్మక ఘట్టంగా అభివర్ణించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ ఖాళీల భర్తీ చేపట్టిందన్నారు. సమీకృత గురుకులాల్లో అన్ని వర్గాలకు చెందిన పేద విద్యార్థులు అయిదు నుంచి ఇంటర్ వరకు చదువుకుంటారన్నారు. తద్వారా వారికి వసతి కష్టాలు తప్పుతాయన్నారు. నిరుపేద విద్యార్థులకు మెరుగైన విద్య, మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం సమీకృత గురుకులాలకు పునాది వేసిందన్నారు. డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, ట్రైకార్ ఛైర్మన్ కోట్నాక తిరుపతి, తహసీల్దార్ సంధ్యారాణి, జిల్లా, మండల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మత్తడి పేల్చివేత ఘటనపై న్యాయ విచారణ జరిపించాలి

- అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించకుంటే కాంట్రాక్టు రద్దు
- ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి

చెన్నూరు, న్యూస్‌టుడే: చెన్నూరు పట్టణంలోని శనిక్కుంట మత్తడి పేల్చివేత ఘటనలో న్యాయ విచారణ జరగాల్సిన అవసరముందని, ఈ ఘటనకు పాల్పడిన వారు ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. గురువారం చెన్నూరులో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో, శుక్రవారం సోమనపల్లి గ్రామంలో సమీకృత గురుకుల పాఠశాలల సముదాయ భవన శంకుస్థాపన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే స్వయంగా ఈ ప్రస్తావనను తీసుకురావడం చర్చనీయాంశంగా మారింది. దీని వెనుక ఉండి నడిపించిన వ్యక్తులెవరు, అసలైన దోషులతో పాటు మత్తడి పేల్చివేతకు వినియోగించిన జిలెటిన్‌స్టిక్స్ ఎక్కడి నుంచి తీసుకొచ్చారనే అంశాలపై సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందన్నారు. ఏదైనా లోపాలుంటే జిల్లా కలెక్టర్ అందుబాటులోనే ఉన్నారని, అవసరమైతే ఈ కేసులో న్యాయ విచారణ జరిపించాలన్నారు. నియోజకవర్గంలో అక్రమదందాలను ఎట్టి పరిస్థితిలో ప్రోత్సహించేది లేదని అన్నారు. అభివృద్ధి పనుల విషయంలో గుత్తేదార్లు నాణ్యత పాటించాలన్నారు. లేదంటే వారి కాంట్రాక్టులను రద్దు చేస్తామని హెచ్చరించారు.

దసరా.. లక్ష్యసాధనలో గెలుపు బాటలో..

● నేడు విజయదశమి

పాండవులు కౌరవులపై, శ్రీరాముడు రావణుడిపై, అమ్మవారు రాక్షసులపై విజయం సాధించిన సందర్భంగా విజయదశమి పండగను జరుపుకొంటుంటాం. ఈ పండగ విజయానికి ప్రతీక.. ప్రతిఒక్కరూ తాము నిర్దేశించుకున్న లక్ష్యంకోసం అహర్నిశలు శ్రమిస్తూ... కొత్త ఉత్సాహంతో ముందుకు సాగితే విజయం మనదే అవుతుంది. జాబ్ క్యాలెండర్‌కు అనుగుణంగా వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు వివిధ ఉద్యోగ పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఏర్పరచుకున్న లక్ష్యం వైపు ఈ రోజు నుంచే అడుగులు వేసి విజయతీరాలకు చేరుకోవాలి. యువత, మహిళలు, విద్యార్థులు ఇలా ప్రతి ఒక్కరూ తాము కన్న కలలను సాకారం చేసుకునేందుకు ముందుకు సాగాలి.





దండేపల్లి, న్యూస్‌టుడే

ఆర్థిక సాధికారత దిశగా..

ఉమ్మడి జిల్లాలో గ్రామైక్య సంఘాలు: 1,926
స్వయం సహాయక సంఘాలు: 41,998
సభ్యులు: 4.25 లక్షలు

మహిళలు ఆర్థిక సాధికారత సాధించిననాడే ఆ కుటుంబాలు మరింత అభివృద్ధి చెందుతాయి. గ్రామీణ పేదరిక నిర్మూలన పథకంలో ఇందిరా మహిళా శక్తి, బ్యాంకు లింకేజీ ద్వారా స్వయం సహాయక మహిళలకు ప్రభుత్వం రుణాలు అందిస్తోంది. దీంతో పాటు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తూ ఆదాయం పొందుతూ సంఘాలను పటిష్ఠం చేసుకుంటున్నారు. కుటుంబ పరిశ్రమలు, సాంకేతిక పరంగా కంప్యూటర్, ఎంబ్రాయిడరీ, బ్యూటీషియన్ తదితర రంగాల్లో ప్రభుత్వం శిక్షణ ఇస్తోంది. వీటిని సద్వినియోగం చేసుకుని మరింత ముందుకు సాగాలి...

విద్యార్థీ విజయోస్తు..

ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు: 126
విద్యార్థులు: 46,000
పాఠశాలలు: 4,779
విద్యార్థులు: 4.80లక్షలు



విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ ఏడాది నుంచి పదో తరగతి వరకు ఆంగ్ల మాధ్యమం గురుకులాలు, ఇలా ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నారు. మార్చి నుంచి ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు బాగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలకు ఎదగాలి.

కలలు కని.. సాకారం చేసుకుని

ఉపాధ్యాయులు కావాలని కలలు కన్నారు. సంవత్సరాల తరబడి సాధన చేశారు. కలలు సాకారం చేసుకున్నారు. అనుకున్నది సాధించారు. త్వరలోనే బడుల్లో చేరి పాఠాలు బోధించనున్నారు. ఇటీవల జరిగిన డీఎస్సీ ఫలితాల్లో ఉమ్మడి జిల్లా నుంచి స్కూల్ అసిస్టెంట్లు, భాషోపాధ్యాయులు, ఎస్జీటీలుగా వందలాది మంది ఎంపికై నియామక పత్రాలు తీసుకున్నారు. వీరంతా రాత్రనక, పగలనక, ఇళ్లలో, గ్రంథాలయాల్లో, శిక్షణ కేంద్రాల్లో సాధన చేశారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని అభ్యర్థులు మరింత ఆత్మవిశ్వాసంతో, పట్టుదలతో ముందుకు సాగి కొలువులు సాధించాలి..



ఆదిలాబాద్ జిల్లాలో ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థుల్లో కొందరు..

డీఎస్సీలో కొలువుల ఇలా..
భర్తీ చేయనున్న పోస్టులు (అన్ని కేడర్లలో)

ఆదిలాబాద్	266
కుమురంభీం	270
మంచిర్యాల	288
నిర్మల్	278

గురిపెడితే గ్రూప్ విజేతవే..

ఈ నెల 21 నుంచి మొదలు డిసెంబరు వరకు గ్రూప్-1, గ్రూప్-3, గ్రూప్-2 పరీక్షలు జరగనున్నాయి. ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా సమయం సద్వినియోగం చేసుకుంటే సాధన చేస్తే సర్కారు కొలువు సాధించవచ్చు. ఆ దిశగా ముందుకు సాగాల్సిన అవసరముంది. రాష్ట్రవ్యాప్తంగా 563 గ్రూప్-1 ఉద్యోగాలకు గతంలోనే ప్రిలిమ్స్ పరీక్షలు పూర్తయి ఫలితాలు రావడంతో ఈ నెల 21 నుంచి మెయిన్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి జిల్లాలో 18,213 మంది అభ్యర్థులు ప్రిలిమ్స్ పరీక్షలు రాయగా 10 వేల మంది మెయిన్‌కు అర్హత సాధించారు. దీంతోపాటు ఇప్పటికే గ్రూప్-2లో రాష్ట్రవ్యాప్తంగా 783 పోస్టులు ఉండగా ఉమ్మడి జిల్లాలో 26 వేల మంది పరీక్ష రాసేందుకు సాధన చేస్తున్నారు. ఈ ఏడాది డిసెంబరు 15 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. గ్రూప్- 3 పోస్టులకు ఈ ఏడాది నవంబరు 15, 16 తేదీల్లో పరీక్షలు జరగనుండగా జిల్లా నుంచి 14 వేల మంది పరీక్ష రాయనున్నారు. ఇవే కాకుండా నేవీ, ఆర్మీ, రైల్వే, బ్యాంకు ఉద్యోగాలకు డిసెంబరులోగా పరీక్షలు జరగనున్నాయి.



ఆదిలాబాద్ బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ తీసుకుంటున్న ఉద్యోగార్థులు

మొక్కవోని దీక్షతో..

ఈమె పేరు మామిడాల వనిత. మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి గ్రామం. పేద కుటుంబం. భర్త జనార్దన్ ప్రైవేటు ఉద్యోగి. ఈమెకు రెండేళ్ల బాబు ఉన్నాడు. ఉద్యోగ సాధనే లక్ష్యంగా ఒక వైపు బాబును చూసుకుంటూనే మరో వైపు ఆత్మవిశ్వాసంతో కృషి చేసింది.. ఏడాది నుంచి ఇంటి వద్దనే కష్టపడుతూ డీఎస్సీలో 47వ ర్యాంకుతో కొలువు సాధించింది..



డిజీలాకర్.. ధ్రువపత్రాలు భద్రం..

చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే:

ఉద్యోగాలు, ప్రవేశాలకు వివిధ ధ్రువపత్రాలు తప్పనిసరి. ఆ సమయంలో హడావుడిలో ఏదో ఒకటి మరచిపోతుంటాం. వెనక్కి వెళ్లలేక అధికారులను బతిమాలుకుంటారు. వారు అనుమతి ఇవ్వకపోతే అవకాశం చేజారుతుంది. ఈ సమస్యను అధిగమించేందుకు అందుబాటులోకి వచ్చిన డిజిటల్ వ్యవస్థ దోహదపడుతుంది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సురక్షిత డిజీలాకర్ యాప్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. పాస్‌పోర్టు దరఖాస్తులకు డీజీలాకర్‌లోని పత్రాల వినియోగానికి అనుమతి ఇస్తుండటం గమనార్హం..

అనుసంధానం..

డిజీలాకర్‌కు అనుసంధానమైన ప్రభుత్వ శాఖల పత్రాలను భద్రపరుచుకోవచ్చు. ఇందుకు ఆయా పత్రాల రిజిస్ట్రేషన్ సంఖ్య నమోదు చేస్తే సరిపోతుంది. అవన్నీ తెరపై కనిపిస్తాయి. ఒకవేళ అనుసంధానం కాకపోతే స్కాన్ చేసి భద్రపరుచుకోవచ్చు. ఇందుకు 1 జీబీ స్టోరేజీ సామర్థ్యం ఉంటుంది. ప్లాట్‌ఫాం ధ్రువ పత్రాల సమర్పణకు యూఆర్ఎల్ లింకు పంపించడానికి కొన్ని సంస్థలు కూడా అనుమతిస్తాయి.



డిజీలాకర్ యాప్ ముఖచిత్రం

ఏయే పత్రాలు అంటే..

ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, కుల, ఆదాయ, జనన ధ్రువపత్రాలు, ఆస్తులకు సంబంధించినవి, రేషన్‌కార్డు, బీమా పత్రాలు, ఓటరు కార్డు, తదితర పత్రాలను భద్రపరుచుకోవచ్చు. డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్‌కార్డు వంటి పత్రాలను దగ్గర ఉంచుకునే బదులు ప్రభుత్వ అధీకృత యాప్‌లో భద్రపరుచుకుంటే మన సమాచారం సురక్షితంగా ఉంటుంది. డిజీలాకర్‌లో చేరగానే పదోతరగతి మొదలుకొని ఆపై తరగతుల పత్రాలను జతచేయాలి

ఏం చేయాలంటే..

ముందుగానే స్మార్ట్ ఫోన్‌లో ప్లేస్టోర్‌లోకి వెళ్లి డిజీ లాకర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయాలి. దానిని ఓపెన్ చేసి పేరు, పుట్టిన తేదీ, ఈ-మెయిల్, ఫోన్ నంబరు నమోదు చేయాలి. ఆరు అంకెల పాస్‌వర్డ్ ఇవ్వాల్సి ఉంటుంది. చరవాణికి వచ్చిన ఓటీపీని నమోదు చేస్తే ఖాతా తెరుచుకుంటుంది. ఆ తర్వాత యాప్‌లో పాన్‌కార్డు, ఆధార్, పది, ఇంటర్, డిగ్రీ ధ్రువపత్రాలజాబితా కనిపిస్తాయి. అందులో మనకు కావాల్సింది ఎంచుకొని అడిగిన మేర వివరాలు నమోదు చేయాలి.

వ్యవసాయ కూలీ బిడ్డ



ఆదిలాబాద్ పట్టణం ఇందిరమ్మ కాలనీకి చెందిన వ్యవసాయ కూలీ సట్లవార్ జ్యోతి కుమారుడు హర్ష్ బంగారుగూడ ఆదర్శ పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. తండ్రి సంజయ్ అనారోగ్యంతో చనిపోయాడు. అమ్మ ఆశలు నెరవేర్చే దిశగా వికసిత్ భారత్ పోటీల్లో ప్రతిభ చాటాడు. జిల్లాలోని ప్రదేశాలను చూడని తాను ఏకంగా గుజరాత్‌లో ఏడు రోజులపాటు జరిగే సదస్సుకు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు.

జిల్లా గురించి గర్వంగా చెబుతా..



ఆదిలాబాద్ పట్టణం శాంతినగర్‌కు చెందిన గుండావార్ మహేష్-శీతల్ దంపతుల కూతురు అక్షర ప్రేరణ జాతీయ సదస్సుకు ఎంపికయ్యారు. పట్టణంలోని లిటిల్‌ఫ్లవర్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న తాను సదస్సులో జిల్లా గురించి గర్వంగా చెబుతానని అక్షర చెబుతోంది.

ప్రతిభ చాటి.. ప్రేరణలో మెరిసి

● జాతీయ సదస్సుకు ఆదిలాబాద్ విద్యార్థుల ఎంపిక
● నేడు గుజరాత్‌కు పయనం

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే: వికసిత్ భారత్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల్లో చిన్ననాటి నుంచి జాతీయతభావం పెంపొందించేలా 'ప్రేరణ ఉత్సవ్' పేరిట కార్యక్రమం నిర్వహిస్తోంది. జిల్లాస్థాయిలో వివిధ పోటీలు నిర్వహించి ఆ పోటీల్లో ప్రతిభ కనబర్చినవారిని జాతీయస్థాయి సదస్సుకు ఎంపిక చేసింది. జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. గైడ్ టీచరుతో కలిసి వారిద్దరు శనివారం గుజరాత్ రాష్ట్రంలోని వాడ్‌నగర్‌కు బయలుదేరి వెళ్లనున్నారు.

విద్యార్థులకు దేశ చరిత్ర, సాంస్కృతిక వారసత్వం, దేశం కోసం ఏం చేయాలనే లక్ష్యాలను నిర్దేశించేలా కేంద్రం 'ప్రేరణ ఉత్సవ్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమానికి సంబంధించి ఏప్రిల్‌లో అన్ని పాఠశాలల నుంచి ప్రతిభ ఉన్న ఇద్దరు విద్యార్థుల చొప్పున ఆదిలాబాద్‌లోని కేంద్రీయ విద్యాలయంలో 70 మందికి ప్రత్యేక కమిటీ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ అంశంపై వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభకనబర్చిన వారిని ముఖాముఖి ద్వారా జాతీయ సదస్సుకు ఎంపిక చేశారు. అలా బంగారుగూడ ఆదర్శ పాఠశాల విద్యార్థి సట్లవార్ హర్ష్, లిటిల్‌ఫ్లవర్ విద్యార్థిని గుండావార్ అక్షర ఎంపికయ్యారు.

రేపటి నుంచి శిక్షణ తరగతులు

ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు గుజరాత్ రాష్ట్రం మేహసన జిల్లా వాడ్‌నగర్ కేంద్రీయ విద్యాలయంలో జాతీయ సదస్సు జరగనుంది. ఏడు రోజులపాటు స్వాభిమాన్, ధైర్య సాహసాలు, భిన్నత్వంలో ఏకత్వం, సత్య నిష్ఠ, నిజాయితీ-నాయకత్వం, సాంకేతిక, విశ్వసనీయత, స్వేచ్ఛ-కర్తవ్యం, దేశభక్తి, సంస్కృతి, సంప్రదాయాలు వంటి అంశాల్లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. చారిత్రక ప్రదేశాలను చూపించనున్నారు. తెలుగు రాష్ట్రాల విద్యార్థులతోపాటు మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, రాజస్థాన్, అసోం, ఒడిశా, బిహార్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల విద్యార్థులతో కలిసి జిల్లా విద్యార్థులు సదస్సులో పాల్గొననున్నారు. సదస్సులో నిర్వహించే ప్రతిభా పోటీల్లో ఎంపికైతే జనవరి 26న రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, నగదు పురస్కారం ఇవ్వనున్నారు.

ప్రతినబూనితే.. ప్రగతి ప్రస్థానమే





● ఉమ్మడిజిల్లాకు అపార అవకాశాలు..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సహజ సిద్ధమైన వనరులు సద్విని యోగమయ్యేలా ప్రజాప్రతినిధులు, అధికారులు కంకణబద్ధులై ఆలోచిస్తే జిల్లా విజేతగా నిలుస్తోంది. విజయదశమి సందర్భంగా ఇక్కడున్న వనరులను సద్వినియోగం చేసుకోవాలని ప్రతిన బూనితే ఉమ్మడి జిల్లా విజయ ప్రస్థానానికి అడ్డే ఉండదు..

అధికారుల పాత్ర

నిజాం ఏలుబడిలో మానవ పరిణామ శాస్త్రవేత్తగా వచ్చిన ఇంగ్లాండ్‌కు చెందిన హైమన్‌డార్ఫ్ మనసును గెల్చుకున్న ఉమ్మడి జిల్లా ప్రజానీకం సేవాగుణంతో పని చేసిన అధికారులను ఎప్పుడూ మర్చిపోలేదు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్థికశాఖ కమిషనర్ రామకృష్ణారావుతోపాటు అహ్మద్‌బాబు, జ్యోతిబుద్ధ ప్రకాశ్, దివ్య దేవరాజన్‌లను గుర్తు చేసుకుంటారు. విధి నిర్వహణను పరమావధిగా భావిస్తూ ప్రభుత్వ పథకాలను అర్హులకు అందేలా నేటి అధికారులు పని చేస్తే ప్రజలకు మేలు జరుగుతుంది. జిల్లా ఖ్యాతి ఇనుమడిస్తుంది.

చేయాల్సిందేమిటి



కడెం, సాత్నాల, మత్తడివాగు, గడ్డెన్నవాగు, స్వర్ణ, ఎల్లంపల్లి జలాశయాలను ఆధునికీకరిస్తే ప్రతీ ఎకరానికి నీరివ్వవచ్చు. రెండు పంటలు పండించడానికి ఆస్కారం ఏర్పడుతుంది. మారుతున్న సమాజానికి అనుగుణంగా అటవీ ఉత్పత్తుల వినియోగంలో ఉట్నూరు ఐటీడీఏ, గిరిజన కో-ఆపరేటివ్ సొసైటీ(జీసీసీ)లను ప్రక్షాళన చేస్తే ఆదివాసీ, గిరిజన సంక్షేమానికి పెద్దపీట వేసినట్లే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించే నిధుల వినియోగంలో పారదర్శకత పాటిస్తే ఉమ్మడి జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలపవచ్చు.

మనకున్నదేంటి



ఉమ్మడి జిల్లా 16,203 చదరపు కిలోమీటర్లతో విస్తరించి ఉంది. ఒకప్పుడు 40 శాతం అటవీ ప్రాంతముంటే ప్రస్తుతం 27 శాతానికి పరిమితమైంది. దాదాపు 28 లక్షల జనాభా ఉండగా మాంగనీసు, బొగ్గు, సున్నపురాయి ఖనిజ సంపద కలిగి ఉంది. పత్తి పంటకు ప్రసిద్ధి పొందింది. ఉమ్మడి రాష్ట్రంలో సోయా సాగుకు పేరెన్నికగన్నది. కూరగాయలు, మిరప, నువ్వులు, పసుపు, వరి పంటలకు అనుకూలంగా ఉంది. జీవనదులు గోదావరి, ప్రాణహిత, పెన్‌గంగ సహా వాగులు, సెలయేళ్లకు కొదువలేదు.

నేతల చొరవ



గోండు వీరుడు కుమురం భీం, స్వాతంత్ర్య తొలితరం నేతలైన వన్నెల ఎల్లన్న, దాజీ శంకర్, కస్తాల రాంకిషన్, కొండా లక్ష్మణ్ బాపూజీ, సామల సదాశివలాంటి వారి త్యాగనిరత అమోఘమైనది. జోడేఘాట్, ఇంద్రవెల్లి పోరాట పటిమ ఉద్యమ చరిత్రను చాటేదే. ఆ స్ఫూర్తికి అనుగుణంగా ప్రజాప్రతినిధులు పక్షపాతం లేకుండా ప్రజా సంక్షేమమే పరమావధిగా ముందుకు సాగితే ఉమ్మడి జిల్లా సర్వతోముఖాభివృద్ధి సాధ్యపడనిదేం కాదు. బాసర ఆర్జీయూకేటీకి అనుబంధంగా మరో విశ్వవిద్యాలయం సహా జిల్లాకో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు, నాలుగు వైద్య కళాశాలలను బలోపేతం చేస్తే విద్య, వైద్యం, ఉపాధి కల్పనలో జిల్లా అగ్రస్థానంలో నిలుస్తుంది. కవ్వాల్ అభయారణ్యం, కుంటాల, గాయత్రి, పొచ్చర ప్రాశస్త్యాన్ని గుర్తించి అభివృద్ధి చేస్తే పర్యాటక రంగంలో కొత్త శోభ సంతరించుకుంటుంది.

రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టుకు తృతీయస్థానం



పతకం, ప్రశంసాపత్రాలతో ఉమ్మడిజిల్లా హ్యాండ్‌బాల్ క్రీడాకారిణులు

మంచిర్యాల క్రీడావిభాగం, ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : రంగారెడ్డి జిల్లా తొర్రూర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి మహిళల హ్యాండ్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు ప్రతిభచాటి తృతీయ స్థానంలో నిలిచినట్లు హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గోనే శ్యాంసుందర్‌రావు, ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్‌లు తెలిపారు. ఈ నెల 9 నుంచి 11 వరకు 53వ సీనియర్ పురుషులు, మహిళల రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు జరిగినట్లు చెప్పారు. మూడో స్థానంలో నిలిచిన జట్టును, దానికి సారథిగా వ్యవహరించిన రమ్య, శిక్షకులు అరవింద్, కల్యాణ్‌లను అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు అభినందించారు.

మూసివేత దిశలో.. ప్రైవేటు డిగ్రీ కళాశాలలు

● ఫీజుల చెల్లింపులో ప్రభుత్వ తాత్సార ఫలితం

ఉమ్మడి జిల్లాలో ప్రైవేటు డిగ్రీ కళాశాలలు మూసివేత దిశగా పయనిస్తున్నాయి. మూడేళ్లుగా ప్రభుత్వం నుంచి బకాయిలు రాకపోవడంతో విద్యాసంస్థలను యజమానులు నిర్వహించలేని స్థితికి చేరుకున్నారు. తక్షణం నిధులు విడుదల చేస్తే తప్ప తాము ముందుకెళ్లలేమని భీష్మించుకు కూర్చున్నారు. ఈ క్రమంలో దసరా సెలవుల తర్వాత కళాశాలలు తెరవబోమని స్పష్టంచేస్తూ యూనివర్సిటీ అధికారులు, ప్రభుత్వానికి వినతిపత్రాలు అందజేస్తున్నారు. -న్యూస్‌టుడే, నిర్మల్ పట్టణం



కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ మల్లారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్య సంఘ బాధ్యులు

ఉమ్మడి జిల్లా పరిధిలోని ప్రైవేటు డిగ్రీ కళాశాలలు: సుమారు 94

రావాల్సిన బకాయిలు: దాదాపు రూ.60 కోట్లకు పైగానే..

ఉద్దేశం ఇదీ..

ఆర్థిక కారణాలతో పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం కావొద్దనే లక్ష్యంతో 2008లో అప్పటి ప్రభుత్వం బోధనా రుసుముల చెల్లింపు పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రైవేటులో చదివే విద్యార్థులకు వారి కోర్సుల రుసుములు ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఇది రెండు రకాలు. మొదటిది ఎంటీఎఫ్- మెయింటెనెన్స్ ఆఫ్ ట్యూషన్ ఫీ (విద్యార్థుల మెస్‌ఛార్జిల కోసం.. ఇది విద్యార్థుల వ్యక్తిగత ఖాతాల్లో జమవుతుంది), రెండోది ఆర్టీఎఫ్- రీఎంబర్స్‌మెంట్ ఆఫ్ ట్యూషన్ ఫీ (కళాశాలలకు చెల్లించేది, ఇది యాజమాన్య ఖాతాల్లో జమవుతుంది). మొదట్లో నిర్ణీత సమయంలోనే విద్యార్థులకు, కళాశాల యాజమాన్యాలకు ఉపకార వేతన రుసుముల చెల్లింపులు జరిగేవి. కానీ, ఇప్పుడా పరిస్థితి లేదు. సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో ఈ ప్రక్రియకు తొలి ఆటంకం ఏర్పడింది. తెలంగాణ ఆవిర్భావం అనంతరం పరిస్థితి మరింత దయనీయంగా మారింది. విద్యార్థులను ఫీజులు అడగలేక, ప్రభుత్వం నుంచి సకాలంలో నిధులు పొందలేక, భవన అద్దె, జీతభత్యాలు, నిర్వహణ వ్యయం.. ఇవన్నీ భరించలేక, అప్పులు చేయడం, వాటికి వడ్డీలు చెల్లించలేక చివరకు మూసేస్తామని ప్రభుత్వానికి నివేదించే స్థాయికి ప్రైవేటు డిగ్రీ కళాశాలలు చేరుకున్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో ఇప్పటికే కొన్ని ప్రైవేటు డిగ్రీ కళాశాలలు మూతబడగా, మరి కొన్ని అదే దారిలో పయనిస్తున్నాయి.

హైకోర్టులో పిల్ దాఖలు చేశాం:

నంగె శ్రీనివాస్, ప్రిన్సిపల్, త్రిదేవి డిగ్రీ కళాశాల, నేరడిగొండ

దాదాపు పదేళ్లుగా అస్తవ్యస్తమై, మూడేళ్లుగా ఉపకార వేతన రుసుముల చెల్లింపులు లేక ప్రైవేటు డిగ్రీ కళాశాలల నిర్వహణ భారమైంది. ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులకు ఎన్నోమార్లు విన్నవించాం. అయినా ఫలితం లేకపోయింది. దీంతో కళాశాలలు మూసేసే పరిస్థితి వచ్చింది. ఇక చేసేదేంలేక ప్రభుత్వంపై న్యాయ పోరాటానికి సిద్ధమయ్యాం. తాజాగా హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశాం. పండగ తర్వాత విచారణ మొదలుకానుంది.

ఆందోళన బాటలో..

నిధులు విడుదల చేయాలని విద్యార్థులు, యాజమాన్యాలు, విద్యార్థి సంఘాలు ఆందోళన చేస్తున్నాయి. డబ్బుల్లేక నిర్వహణ భారంగా మారుతోందని కళాశాలలు వాపోతుండగా, ప్రభుత్వంపై ఆధారపడి ప్రవేశాలు పొందిన తమ పిల్లల చదువులు కొనసాగించలేక, ఫీజులు చెల్లించలేక, పై చదువులకు వెళ్లే అవకాశాన్ని కోల్పోతున్నారని పోషకులు ఆవేదన చెందుతున్నారు. విద్యార్థుల నుంచి రుసుములు వసూలుకు ఒత్తిడిచేస్తే ఆ కళాశాలలను బ్లాక్‌లిస్ట్‌లో చేర్చాలంటూ ఉన్నతవిద్యా మండలి అధికారులు ఆదేశిస్తుండటంతో నిస్సహాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

నేటితో ముగియనున్న నవరాత్రి ఉత్సవాలు



సిద్ధిధాత్రి రూపంలో అమ్మవారు

ముధోల్(బాసర), న్యూస్‌టుడే: బాసర సరస్వతి అమ్మవారి ఆలయంలో కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారం పూర్ణాహుతితో ముగియనున్నాయి. తొమ్మిది రోజుల క్రితం ప్రారంభమైన ఉత్సవాలు శుక్రవారం కొనసాగాయి. అమ్మవారు సిద్ధిధాత్రి రూపంలో దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు చేశారు. సరస్వతి దీక్షలు తీసుకున్న భక్తులు అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వేదపండితులు చండీయాగం ప్రారంభించారు. గణపతి పూజ, మండపారాధన, స్థాపిత దేవతాహవనం, తదితర పూజలు చేశారు. శనివారంతో నవరాత్రి ఉత్సవాలు ముగియనుండటంతో వేకువజామున నుంచి చండీహోమం, మహాపూర్ణాహుతి ఉంటుందని, అమ్మవారి అభిషేకం అనంతరం భక్తులకు దర్శనం ఉంటుందని ఆలయాధికారులు తెలిపారు.

తెలంగాణ అంతటా సింగరేణి వెలుగులు



ఇందారంలోని ఐకేఏ గని సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వంశీకృష్ణ

భీమారం: తెలంగాణ అంతటా వెలుగులు నింపే శక్తిగా సింగరేణి నిలిచిందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. జైపూర్ మండలం ఇందారంలోని ఐకే-1ఏ గనిపై శుక్రవారం జరిగిన ఉజ్వల సింగరేణి- ఉద్యోగుల పాత్ర సమావేశానికి ఆయన చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామితో కలిసి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ గతంలో నష్టాల్లో ఉన్నప్పుడు అప్పుడు కేంద్ర మంత్రిగా ఉన్న కాకా చొరవతో అప్పుల భారం నుంచి లాభాల్లోకి వెళ్లిందన్నారు. ఈ ఏడాది తొలిసారి కాంట్రాక్టు కార్మికులకు లాభాలలో వాటా అందజేశారన్నారు. సింగరేణి సీఎస్ఆర్ నిధులతో ప్రభావిత ప్రాంతాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం చాలా గొప్ప విషయమని అన్నారు. జైపూర్‌లోని ఎస్టీపీపీలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్టీపీపీ ప్రారంభమైన 3 ఏళ్లలోనే జాతీయస్థాయి ఉత్తమ పవర్ జనరేషన్ సంస్థగా అవార్డు సాధించడం గొప్ప విషయమని అన్నారు. త్వరలోనే మరో 800 మెగావాట్ల యూనిట్ పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. స్థానికులకు, భూమిని కోల్పోయిన నిర్వాసితులకు సంస్థలో ఉద్యోగావకాశాలు త్వరగా కల్పించాలని జీఎంకు సూచించారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ఎస్టీపీపీ ఈడీ ఎన్వీ. రాజశేఖర్, శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, డీజీఎం వెంకటేశ్వర్లు, ఎస్టీపీపీ జీఎంలు శ్రీనివాసులు, సముద్రాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

14న జిల్లా, జోనల్‌స్థాయి తైక్వాండో పోటీలు

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడా సమాఖ్య ఈ నెల 14న అండర్-14, 17విభాగాల బాలబాలికలకు జిల్లా, జోనల్(ఉమ్మడి జిల్లా)స్థాయి తైక్వాండో పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఫణిరాజా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల పట్టణంలోని సెవెన్‌హిల్స్ పాఠశాలలో సోమవారం ఉదయం 9 గంటలకు జిల్లా, మధ్యాహ్నం 12గంటలకు జోనల్‌స్థాయిలో ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. హాజరయ్యే క్రీడాకారులు ఎస్‌జీఎఫ్ పత్రాలు(ఆయా జిల్లాల కార్యదర్శులు సంతకాలతో), బోనఫైడ్, ఆధార్‌కార్డు ధ్రువీకరణపత్రాలు నాలుగు జతలు వెంట తీసుకురావాలని సూచించారు.

17న జిల్లా, జోనల్‌స్థాయి ఫెన్సింగ్..

అండర్-14, 17విభాగాల్లో బాలబాలికలకు ఈ నెల 17న జిల్లా, జోనల్(ఉమ్మడి జిల్లా)స్థాయి ఫెన్సింగ్ పోటీలు మంచిర్యాల జిల్లాలోని శ్రీరాంపూర్ సీఈఆర్ క్లబ్ నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఫణిరాజా తెలిపారు.

రవాణా శాఖ కార్యాలయంలో తేనెటీగల దాడి

హాజీపూర్, న్యూస్‌టుడే: హాజీపూర్ మండలం వేంపల్లిలోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో శుక్రవారం తేనెటీగలు హల్‌చల్ సృష్టించాయి. కార్యాలయం పై భాగంలో గూడు కట్టుకున్న తేనెటీగలు ఒక్కసారిగా లేచి కార్యాలయం అధికారులు, సిబ్బంది, వాహనదారులపై దాడిచేయడంతో అందరూ భయాందోళనకు గురయ్యారు. కార్యాలయం పనివేళలు ప్రారంభం కాగానే లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్ల కోసం పదుల సంఖ్యలో వాహనదారులు చేరుకున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా తేనెటీగలు దాడికి పాల్పడగా అందరూ భయానికి గురై దూరం పారిపోయారు. ఓ వాహనదారుడిపై తేనెటీగలు దాడిచేయగా ఆయనను కాపాడేందుకు ఎంవీఐ రంజిత్‌రెడ్డి ప్రయత్నించి ఆయన గాయాలపాలయ్యారు. గాయపడిన పలువురిని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అనంతరం ఇళ్లకు పంపించారు. మధ్యాహ్నం వరకు అంతా సద్దుమణగడంతో కార్యాలయం పనులు కొనసాగించారు.

అసభ్యకరంగా ప్రవర్తించిన వారిపై కేసులు నమోదు

మంచిర్యాలనేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని హమాలివాడ ప్రాంతంలో గురువారం అర్ధరాత్రి కొంతమంది యువకులు అసభ్యకరంగా ప్రవర్తిస్తూ జరిపిన దాడుల్లో నాలుగు కేసులు నమోదు చేసినట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు. అశోక్‌రోడ్, తిలక్‌నగర్, చర్చి వద్ద, ఒకరిపై ఒకరు చేసుకున్న దాడుల్లో కొంతమందికి గాయాలయ్యాయన్నారు. ఇరువురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పుర ఛైర్‌పర్సన్‌పై హత్యాయత్నం?

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే: ఓ వ్యక్తి ఇటీవల తనపై హత్యాయత్నానికి పాల్పడ్డారని క్యాతనపల్లి పుర ఛైర్‌పర్సన్ జంగం కళ తెలిపారు. బంధుమిత్రులతో కలిసి పనిపై వెళ్లి తిరిగి వస్తుండగా అమరవాది చెరువు వద్ద గల రోడ్డు పక్కన కారు నిలపామన్నారు. దీన్ని గమనించి ఓ వ్యక్తి తన వాహనంతో కారును ఢీకొట్టి పారిపోయారన్నారు. కారు ముందు భాగం కొంత మేర ధ్వంసమైందని చెప్పారు. ఈ విషయమై పట్టణ ఎస్సై రాజశేఖర్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

బెల్లంపల్లిలో ఫ్లెక్సీల జాతర

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: దసరా పండగ సందర్భంగా పట్టణంలో ఫ్లెక్సీల జాతర కనిపిస్తుంది. అన్ని పార్టీల ఆధ్వర్యంలో నాయకులు దసరా శుభాకాంక్షలు చెబుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కొత్తబస్టాండ్ నుంచి బజార్‌ఏరియా, కాంటాచౌరస్తా, ఏఎంసీ, కాల్‌టెక్స్, రైల్వే స్టేషన్ ఏరియాల్లో ఆయా పార్టీల నాయకులు పోటాపోటీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఆయా పార్టీల అధిష్ఠానాల దృష్టిలో పడేందుకు కార్యకర్తలంతా ఫ్లెక్సీల రూపంలో తమ అభిమానాన్ని చాటి చెబుతున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ప్రజలంతా ఈ ఫ్లెక్సీలను ఆసక్తిగా తిలకిస్తున్నారు.


మందమర్రిలో అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వివేక్


ఆదిల్‌పేటలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో దుర్గామాతకు ప్రత్యేక పూజలు

హాజీపూర్, దండేపల్లి, మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో దుర్గామాత మండపాల్లో శుక్రవారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దండేపల్లిలో దుర్గామాత విగ్రహం ముందు 108 రకాల నైవేద్యాలను సమర్పించారు. మందమర్రి మండలం ఆదిల్‌పేట గ్రామంలో మహిళలు భక్తిశ్రద్ధలతో కలశ పూజ నిర్వహించారు. పట్టణంలోని దుర్గామాత ఆలయంలో అమ్మవారిని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.


ముల్కల్లలో ..

నేడు తిలక్‌మైదానంలో రావణాసురవధ

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాలకు బెల్లంపల్లి పట్టణంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం పట్టణంలో దసరా ఉత్సవాలు నిర్వహించనున్నారు. మూడు రోజులుగా రావణాసురవధ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు మిరుమిట్లు గొలిపేలా లైటింగ్ ఏర్పాటు చేశారు. రావణాసురవధ దహనం సమయంలో టపాసులు భారీ ఎత్తున పేలేలా చర్యలు చేపడుతున్నారు. పట్టణంతో పాటు చుట్టు గ్రామాల నుంచి ప్రజలంతా రానుండడంతో మైదానంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హిందూ ఉత్సవ సమితి సభ్యులకు పోలీసులు పలు సూచనలు చేశారు.

చెన్నూరు: దసరా వేడుకలకు చెన్నూరు పట్టణం గోదావరిరోడ్డు మార్గంలోని ఆలయం పరిసరాల్లో పురపాలిక శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వేడుకలకు పురస్కరించుకొని గోదావరమ్మ ఆలయం వద్ద ఏటా జమ్మిచెట్టుకు పూజలు నిర్వహిస్తారు. ఆ మార్గంలో విద్యుత్తు దీపాలు, ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పురపాలిక కమిషనర్ గంగాధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్ పనులను పరిశీలించారు.


తిలక్ మైదానంలో ఏర్పాటు చేసిన రావణాసురుని బొమ్మ


ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

విద్యతో సమాజంలో మంచి గుర్తింపు

చెన్నూరు, న్యూస్‌టుడే: చదువుకుంటే సంస్కారవంతులు అవుతారని, విద్యతో సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. చెన్నూరు మండలం సోమనపల్లి గ్రామంలో సమీకృత గురుకుల పాఠశాలల సముదాయ భవన నిర్మాణ స్థలంలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమీకృత గురుకుల సముదాయ భవనాల ఏర్పాటు జాబితాలో తొలుత చెన్నూరు పేరు లేదన్నారు. చెన్నూరులో కచ్చితంగా ఈ పాఠశాల ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కలను కోరామన్నారు. ఇంత పెద్ద పాఠశాల ఇక్కడ ఉండటం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా రూ. 500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. ఆ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. చెన్నూరులో వంద పడకల ఆసుపత్రిని త్వరగా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు.

గతంలో గురుకులాల్లో సౌకర్యాల లేమి కారణంగా విద్యార్థులు అనేక ఇబ్బందులెదుర్కొన్నారని పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ అన్నారు. రానున్న పోటీ ప్రపంచంలో ముందుకెళ్లాలంటే విద్య చాలా అవసరమన్నారు. ఆ దిశగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. జోడువాగుల రోడ్డు అనుమతుల కోసం కేంద్ర మంత్రిని కలిశామన్నారు. పాఠశాల ఏర్పాటుతో ఈ ప్రాంతంలో పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందుబాటులోకి రానుందని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


సోమనపల్లిలో సమీకృత గురుకుల సముదాయ భవన నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, కలెక్టర్ కుమార్‌దీపక్, తదితరులు

అయిదుగురు జూదరుల పట్టివేత

మందమర్రి పట్టణం: మందమర్రి మండలం చతలాపూర్ గ్రామశివారులో శుక్రవారం అయిదుగురు జూదరులను పట్టుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. వారి నుంచి రూ. 15,720 నగదు, అయిదు చరవాణులు, మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

కోటపల్లి, న్యూస్‌టుడే: ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కుమార్‌దీపక్ హెచ్చరించారు. కోటపల్లి మండలం కొల్లూర్‌లో టీఎస్ఎండీసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఇసుక రీచును శుక్రవారం రాత్రి తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సంబంధిత వెబ్‌సైట్‌లో బుక్ చేసుకున్న వారికి నేరుగా ఇసుక సరఫరా చేస్తారన్నారు.

విద్యుత్తు శాఖలో బదిలీలకు ఉత్తర్వులు

మంచిర్యాల సిటీ, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖలో నాలుగు రోజుల కింద జరగాల్సిన బదిలీల ప్రక్రియ వాయిదా పడిన విషయం విదితమే. అయితే శుక్రవారం రాత్రి సంబంధిత ఎన్‌పీడీసీఎల్ శాఖ బదిలీల ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీలకు అర్హతలు ఉన్న వారందరి జాబితాను విడుదల చేసింది. మంచిర్యాల జిల్లా పరిధిలో ఏడీఈలు 8 మందికి, 21 మంది ఏఈలకు, 15 మంది సబ్ ఇంజినీర్లకు, నలుగురు ఫోర్‌మెన్‌లకు, 10 మంది జేఏఓలకు, నలుగురు జూనియర్ అసిస్టెంట్‌లు, ఆరుగురు ఓఏస్‌లు, ఇద్దరు రికార్డు అసిస్టెంట్‌లు, 8 మంది సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్లు, 10 మంది అసిస్టెంట్ లైన్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేశారు. ఈ నెల 15వ తేదీ లోపు వారు వారికి కేటాయించిన స్థానాల్లో రిపోర్టు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

ఐకమత్యంగా ఉండి అభివృద్ధికి ప్రణాళిక చేయండి

నెన్నెల, న్యూస్‌టుడే: కాంగ్రెస్ శ్రేణులు ఐకమత్యంగా ఉండి అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలని ఎమ్మెల్యే వినోద్ పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో కళాశాల భవనం నిర్మాణానికి ఐం రూ. 3.21 కోట్ల నిధులలో పనులు ప్రారంభించడానికి శంకుస్థాపన చేసిన అనంతరం కార్యకర్తలతో మాట్లాడారు. గీత కార్మికులకు వారు చేసే పనిలో రక్షణ కోసం రక్షణ కవచాల కిట్లు పంపిణీ చేశారు. జిల్లా విద్యాధికారి యాదయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గట్టు మల్లేష్, నాయకులు, హరీష్‌గౌడ్, మల్లాగౌడ్, శంకర్ పాల్గొన్నారు.


గీత కార్మికులకు రక్షణ కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వినోద్

పనిచేయని నియంత్రికలు.. ఎండుతున్న పంటలు

చెన్నూరు, న్యూస్‌టుడే: చెన్నూరు మండలం కొమ్మెర, పొక్కూరు విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలో పంటపొలాలకు నీరందించేందుకు ఏర్పాటు చేసుకున్న బోర్లకు విద్యుత్తు సరఫరా చేస్తున్న నియంత్రికలు పనిచేయకపోవడంతో పంటపొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాలను కాపాడుకునేందుకు కొత్త నియంత్రికలను తీసుకొచ్చినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వాటికి కనెక్షన్లు ఇవ్వడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. నాలుగు రోజులుగా సరఫరా పునరుద్ధరించకపోవడంతో పంటలకు నీరందక ఎండిపోతున్నాయని వారు వాపోతున్నారు. విద్యుత్తుశాఖ అధికారులు తక్షణం స్పందించాలని రైతులు కోరుతున్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

కాసిపేట, న్యూస్‌టుడే: ఉపవాస దీక్షలకు వచ్చే క్రైస్తవ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేసుకోవాలని సీపీ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కల్వారి చర్చి పాస్టర్ ప్రవీణ్ 50 రోజుల ఉపవాస ముగింపు దీక్ష ఈ నెల 17న పెద్దనపల్లి శివారులో నిర్వహిస్తున్నారు. దీంతో ఏర్పాట్లను డీసీపీ భాస్కర్‌తో కలిసి పరిశీలించారు. వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు లక్ష పైచిలుకు క్రైస్తవుల వస్తుండటంతో భద్రత పరమైన ఏర్పాట్లు పరిశీలించి పలు సూచనలు సలహాలు అందించారు. పార్కింగ్, భోజన సభ ప్రాంగణాలను పరిశీలించారు. ఎలాంటి భద్రత పరమైన ఇబ్బందులు లేకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు చేసినట్లు చెప్పారు. చర్చి డీసీపీ రాజు, స్పెషల్ బ్రాంచి ఏసీపీ రాఘవేంద్రరావు, ఏసీపీ రవికుమార్, ప్రతీప్, సుందర్‌రావు, సీఐ శశిధర్ రెడ్డి, ఆర్ఐ వామనమూర్తి, ఎస్సై ప్రవీణ్ కుమార్ ఉన్నారు.


సభ ఏర్పాట్ల మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాస్

బీమా చెక్కు అందజేత

నెన్నెల, న్యూస్‌టుడే: మండలంలోని నందులపల్లి గ్రామానికి చెందిన బోయిని సబితకు ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా రెండు లక్షల రూపాయల చెక్కును తెలంగాణ గ్రామీణ బ్యాంకులో మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి అందించారు. ఆయన మాట్లాడుతూ ఆమె భర్త రమేష్ అనారోగ్యంతో మృతి చెందడంతో బీమా మంజూరైనట్లు చెప్పారు. బ్యాంకు అధికారులు భానుప్రసాద్, విక్రమ్ కుమార్ పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

భీమారం: గొర్రె, మేకల వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్‌యాదవ్ పుట్టిన రోజులు వేడుకలు కాజీపల్లి గ్రామంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని సుమారు 150 మంది మహిళలకు తహసీల్దారు సదానందం చేతుల మీదుగా చీరలను పంపిణీ చేశారు. ఏఎస్సై భూమన్న, ఆర్ఐ స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

బాల్య మిత్రుడికి అండగా..

భీమారం: జైపూర్ జడ్పీఉన్నత పాఠశాలలో చదువుకున్న 2002-03 బృందం విద్యార్థి శ్రీరాంపూర్‌కు చెందిన సముద్రాల రాజు అనారోగ్యంతో బాధపడుతున్నాడని తెలుసుకున్న బాల్య మిత్రులు తమ అమిగోస్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా శుక్రవారం అతడి ఇంటికి వెళ్లి రూ. 30 వేల నగదు సహాయంగా అందజేశారు.


అవగాహన కల్పిస్తున్న జీఎం బి.సంజీవరెడ్డి



ఉద్యోగుల కృషితో సంస్థకు లాభాలు

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: సంస్థలో పని చేస్తున్న ఉద్యోగుల కృషి, పట్టుదలతో సంస్థకు లాభాలు వస్తున్నాయని శ్రీరాంపూర్ జీఎం బి.సంజీవరెడ్డి పేర్కొన్నారు. ఏరియాలోని రవీంద్రఖని-7, శ్రీరాంపూర్-3, 3ఏ గనులు, డిస్పెన్సరీ, ఎస్అండ్‌పీసీ కార్యాలయం, సివిల్ విభాగాల్లో 'ఉజ్వల సింగరేణి-ఉద్యోగుల పాత్ర' అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో పాల్గొన్న జీఎం మాట్లాడుతూ ప్రస్తుత పోటీ మార్కెట్‌లో సంస్థ మనుగడ సాధించాలంటే ఉద్యోగుల మరింత కష్టపడి పని చేయాల్సిన అవసరముందన్నారు. వృథా ఖర్చులు తగ్గించి ఉత్పత్తిని పెంచితే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. ప్రతిఒక్కరికీ సంస్థ స్థితిగతులపై అవగాహన ఉండాలన్నారు. మానవ వనరులు పూర్తి స్థాయిలో వినియోగిస్తూ, యంత్రాల పని గంటలు పెంచుకోవాలని పేర్కొన్నారు. ఏజీఎం(ఫైనాన్స్) మురళీధర్, గుర్తింపు సంఘం ఏరియా ఉపాధ్యక్షుడు ఎస్‌కే బాజీసైదా, సీఎంఓఏఐ ఏరియా అధ్యక్షుడు కె.వెంకటేశ్వర్‌రెడ్డి, నవీన్, గోపాల్‌సింగ్, రాముడు, శ్రీధర్, చంద్రలింగం, డాక్టర్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

* రవీంద్రఖని-6 గనిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఏజెంట్ ఎన్.శ్రీధర్ మాట్లాడుతూ ఉద్యోగులందరూ తప్పకుండా విధులకు హాజరుకావాలని సూచించారు. అనంతరం ఉద్యోగులతో కలసి ప్రతిజ్ఞ చేశారు. గని మేనేజర్ ఇ.తిరుపతి, ఎస్‌కే బాజీసైదా, కె.శ్రీనివాస్, కొమురయ్య, రాంనర్సయ్య, సదానందం, రాంచదర్, మహేష్ పాల్గొన్నారు.

డీఎంఎఫ్‌టీ నిధులతో చెన్నూరు అభివృద్ధి


మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే: మందమర్రి ఏరియాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకును సింగరేణికే కేటాయించేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తామని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. శుక్రవారం స్థానిక కేకే5 గనిపై 'ఉజ్వల సింగరేణి-ఉద్యోగుల పాత్ర' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జీఎం దేవేందర్, మాజీ ఎమ్మెల్యే ఓదెలుతో కలిసి ఎమ్మెల్యే వివేక్ పాల్గొని మాట్లాడారు. 70 నుంచి వంద మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించుకుంటే కొత్త గనులు, ఉద్యోగాలు వస్తాయన్నారు. సింగరేణికి సంబంధించిన డీఎంఎఫ్‌టీ నిధులు రూ.40 కోట్లతో చెన్నూరు అభివృద్ధి చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. దసరా పండగ సందర్భంగా గనులపై కార్మికులకు విందు కార్యక్రమం నిర్వహించారు. రమేష్, అక్బర్ ఆలీ, రాజన్న, రాందాస్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఉత్పత్తి శాతం పెంచాలి

కాసిపేట, న్యూస్‌టుడే: సింగరేణి భూగర్భ గనుల్లో పని చేస్తున్న కార్మికులు సంస్థను కాపాడుకునేలా, సమన్వయంతో పనులు చేస్తూ ఉత్పత్తి శాతం పెంచుకోవాలని ఎమ్మెల్యే వినోద్, ఎంపీ వంశీకృష్ణ అన్నారు. కాసిపేట గనిపై 'ఉజ్వల సింగరేణి ఉద్యోగుల పాత్ర' అవగాహన కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే, ఎంపీ వేర్వేరుగా అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం అమలు చేసే నూతన విధానాలపై ఉద్యోగులపై అవగాహన కల్పించారు. అనంతరం ఉద్యోగులు, అధికారులు కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఎస్వోటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి మల్లేశ్, మీనుగు లక్ష్మీనారాయణ, రాపర్తి శ్రీనివాస్, నర్సింగ్, విక్రమ్ తదితరులున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

దండేపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: క్రీడలతో మానసికోల్లాసం చేకూరుతుందని, ప్రతి ఒక్కరు ఓటమిని స్ఫూర్తిగా తీసుకోవాలని పలువురు నాయకులు అన్నారు. దండేపల్లి మండలం తాళ్లపేట ఉన్నత పాఠశాలలో పది రోజుల పాటు నిర్వహించిన వాలీబాల్ శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిశాయి. శిబిరాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని క్రీడల్లో రాణించాలన్నారు. గల్ఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ. 10 వేల విలువైన క్రీడా దుస్తులను క్రీడాకారులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కంది సతీష్‌కుమార్, మాజీ ఉప సర్పంచి పుట్టపాక తిరుపతి, గల్ఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు సందల మల్లేశ్, నిర్వాహకులు అఫ్రోజ్, రాజు, రమేశ్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


తాళ్లపేటలో క్రీడాకారులతో గల్ఫ్ అసోసియేషన్ సభ్యులు, నాయకులు